
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







## ఎవరికీ పట్టని ఎరకన్నపాలెం!



- కనీస సౌకర్యాలు లేక గిరిజనుల అవస్థలు
- టీడీపీ హయాంలో రోడ్డుకు నిధులు మంజూరు
- వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పనులు నిలుపుదల
- ఇలా ఎన్నెన్నో సమస్యలతో గిరిజన గ్రామం సతమతం

- వార్త 5వ పేజీలో..

# గంగవరంలో గ్రావెల్ దోపిడీ

## అక్రమార్కుల బరితెగింపు

- రేయింబవళ్లు దర్జాగా తవ్వి తరలింపు
- జగనన్న కాలనీ లేఅవుట్‌లో మట్టినీ వదలని వైనం
- వైసీపీ నేతల ప్రమేయం ఉండడంతో అధికారులు చూడనట్టు వదిలేస్తున్నారని ఆరోపణలు
- గతంలో తహసీల్దార్ ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు



గంగవరంలో జగనన్న కాలనీ కొండవాలు ప్రాంతంలో గ్రావెల్ తవ్విన దృశ్యం

సబ్బవరం, జనవరి 17: జీవీఎంసీ 88వ వార్డు గంగవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడి జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతంలో గ్రావెల్‌ను గత పదిహేను రోజులుగా రేయింబవళ్లు తవ్వుకుపోతున్నారు. దీని వెనుక వైసీపీ నాయకులు ఉండడంతో మైన్స్, విజిలెన్స్, రెవెన్యూ శాఖలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంగవరంలో గత రెండేళ్లగా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో జగనన్న కాలనీ లేఅవుట్, రైతుల పరిహారం ప్లాట్ల(ఆర్‌సీ ప్లాట్లు) అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనికి కాంట్రాక్టర్లు కొంత మంది సూపర్‌వైజర్లను నియమించారు. స్థానికులు కొంత మంది లారీలు, ఎక్స్‌కవేటర్లను లేఅవుట్ అభివృద్ధి పనులకు లీజుకు ఇచ్చారు. ఆ వాహనాలన్నీ లేఅవుట్‌లోనే ఉంటున్నాయి. కొందరు వైసీపీ నాయకులు ఇక్కడి గ్రావెల్ తరలించుకుపోయేందుకు ప్రణాళిక వేశారు. సూపర్‌వైజర్లను మచ్చిక చేసుకుని పట్టపగలే కొండవాలు ప్రాంతంలోని ... మిగతా 6వ పేజీలో



పట్టపగలు గ్రావెల్ తవ్వేస్తున్న దృశ్యం

## ఇసుక తోడేళ్లు

- తగరంపూడి వద్ద శారదా నదిలో మళ్లీ దర్జాగా ఇసుక అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ, గనుల శాఖలు



తగరంపూడిలో ఖాళీ ప్రదేశంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన ఇసుక పోగులు

**అనకాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):** అనకాపల్లి మండలం తగరంపూడి వద్ద శారదా నదిలో మళ్లీ ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. గతంలో కొంత మంది ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేయడంతో నిలిచిపోయిన తవ్వకాలు సంక్రాంతి పండుగ వేళ మళ్లీ గుట్టుగా మొదలయ్యాయి. రెవెన్యూ, పోలీస్, గనుల శాఖల అధికారులతో కొందరు వైసీపీ నాయకులు మామ్ముళ్లు మాట్లాడుకుని శారదా నదిలో ఇసుకను రాత్రి వేళల్లో తోడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలోని కోడూరులో ఇసుక డిపో ఎత్తేయడంతో అనకాపల్లి పరిసరాల్లో ఇసుకకు బాగా డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా భావించి కొంత మంది వైసీపీ నాయకులు ఇసుక తవ్వకాలు జరిపి అమ్ముకొంటున్నారు. తగరంపూడి గ్రామానికి ఆనుకొని వున్న నూకాలమ్మ తల్లి గుడి, ఊరికి శివారున ఉన్న శ్మశాన వాటిక ప్రదేశాల్లో ఇసుక తోడేస్తున్నారు. శారదా నది నుంచి ఎడ్లబళ్లపై ఇసుక గ్రామంలోకి రవాణా చేసుకొని తగరంపూడిలో ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. ఈ ఇసుకను కుంచంగి, కూండ్రం, రాజాం, అనకాపల్లి, తుమ్మపాల పరిసరాల్లో ప్రైవేటు నిర్మాణ పనులకు ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. పర్యావరణ చట్టాలకు విరుద్ధంగా శారదా నదిలో ఇసుక తవ్వకాలు జరపరాదని గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా వైసీపీ స్థానిక నేత ఒకరు తానే అన్నీ అయి ఇసుక తవ్వకాలు దగ్గరుండి జరిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తగరంపూడిలో అక్రమ ఇసుక తవ్వకాలపై స్థానికులు కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇసుక తవ్వకాలు నిలిపేశారు. సంక్రాంతి పండుగ ప్రారంభం నుంచి గత మూడు రోజులుగా ఇసుక తవ్వకాలు మళ్లీ ప్రారంభించినా పోలీసు, రెవెన్యూ, గనుల శాఖాధికారులు మౌనంగా ఉండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# జనసేనలోకి కొణతాల?

- పవన్‌కల్యాణ్‌తో భేటీ
- ఈ నెలలోనే పార్టీలో చేరతానని చెప్పినట్టు సమాచారం
- అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్టు ప్రచారం



హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌ను కలిసిన సీనియర్ నేత కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రాజకీయంగా అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికార పార్టీకి చెందిన అనేక మంది తెలుగుదేశం, జనసేనల్లో చేరిపోతున్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయులు రెండు వారాల కిందట తెలుగుదేశం పార్టీలో చేరారు. కాగా, మరో సీనియర్ నేతగా పేరొందిన కొణతాల రామకృష్ణ జనసేనలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిశారు.

ఈ భేటీలో ఉత్తరాంధ్రకు సంబంధించిన అనేక విషయాలపై చర్చించినట్టు కొణతాల అనుచరులు చెబుతున్నారు. మంచి రోజు చూసుకుని ఈ నెలలోనే పార్టీలో చేరతానని పవన్‌కల్యాణ్‌కు కొణతాల చెప్పినట్టు సమాచారం. ఆయన అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్టు తెలిసింది. గవర సామాజిక వర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుంచి 1996 వరకు అనకాపల్లి ఎంపీగా పని చేశారు. 2004 నుంచి 2009 వరకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, న్యాయ శాఖల మంత్రిగా ఉన్నారు. 2009 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ...ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచారు. వైఎస్ఆర్ సీపీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం వైసీపీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఉత్తరాంధ్ర సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్నారు. అయితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఆయన అందులో చేరవచ్చుననే ఊహాగానాలు వినిపించాయి. ఈ మేరకు కేవీపీ రామచంద్రరావు చర్చలు జరిపినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే కొణతాల జనసేన వైపు మొగ్గుచూపారు.

# వీసీ ప్రసాదరెడ్డే

## ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మరోసారి అవకాశం

- చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి
- బొత్సకు సర్దిచెప్పినట్టు ప్రచారం



ప్రసాదరెడ్డి

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డినే మళ్లీ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇది పక్కా రాజకీయ నియామకమని అధికార పార్టీ నాయకులే చెబుతున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో పోటీ చేసే వైసీపీ నాయకులకు సహకరించడంతో పాటు ఉత్తరాంధ్రలో పార్టీ, అభ్యర్థుల జయాపజయాలపై ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించడానికి ప్రసాదరెడ్డి ఉపయోగపడతారని, అందుకే ఆయనకు మళ్లీ వీసీ పదవి ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఆయన్ను వీసీగా కొనసాగించడం ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డికి సుతారమూ ఇష్టం లేదని తెలిసింది. ఆయన వల్ల పార్టీకి చెడ్డపేరు వచ్చిందని, యూనివర్సిటీ రాజకీయ వేదికగా మారిపోయిందనే ప్రచారం జరుగుతున్నందున మళ్లీ అవకాశం ఇవ్వొద్దని అధిష్ఠానానికి చెప్పినట్టు సమాచారం. విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కూడా అదే అభిప్రాయంతో ఉన్నారని, ఆయన కూడా ... మిగతా 6వ పేజీలో

## శ్రీకాకుళం అంబేడ్కర్ వర్సిటీ, అనంతపురం జేఎన్‌టీయూ వీసీలుగా ఏయూ ఆచార్యులు



కె.రజని



జీవీఆర్ శ్రీనివాసరావు

**విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా తాజా మాజీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మరోమారు నియమితులయ్యారు. అలాగే శ్రీకాకుళంలో బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఏయూ తత్వశాస్త్ర విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు కె.రజని, అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతిగా ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు జీవీఆర్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

# అంగన్‌వాడీల వినూత్న నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. జిల్లాలో పలు విధాలుగా ఆందోళన కొనసాగిస్తుండగా బుధవారం మునగపాకలో అంగన్‌వాడీలు ఆకులు నములుతూ వినూత్న నిరసన తెలిపారు.

- వార్త 6వ పేజీలో..




మునగపాకలోని శిబిరంలో ఆకులు నములుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

# సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చేదెన్నడో?

## సిబ్బంది నియామకం లేక రోగులకు అందని సేవలు



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో సిటీస్కాన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, తదితరులు (ఫైల్)




ఎన్టీఆర్ ఆస్పత్రిలో మూసివున్న సిటీస్కాన్ విభాగం

అనకాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రిలో సిటీస్కాన్ సేవలు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది డిసెంబరు 20న కొత్త సిటీస్కాన్ యంత్రాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించడంతో తమ కష్టాలు తీరతాయని రోగులు భావించారు. అయితే దానికి తగిన సిబ్బంది లేక మూతపడడంతో నిరాశ చెందుతున్నారు.

ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రిలో సిటీస్కాన్ సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవలసి వస్తోంది. ఈ క్రమంలో అదాని ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ ఆస్పత్రికి సిటీస్కాన్ యంత్రాన్ని అందజేసింది. దీనిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గత డిసెంబరు 20న ప్రారంభించారు. సిటీ స్కాన్ సేవలు వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయని ఆయన ప్రకటించారు. అయితే ఇది వినియోగంలోకి రావాలంటే ఇద్దరు టెక్నీషియన్లు, నలుగురు సహాయకులు, ఒక మేనేజరు.. మొత్తం ఏడుగురు సిబ్బంది అవసరమని ఆస్పత్రి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు ... మిగతా 6వ పేజీలో

# తిరుగు ప్రయాణాల రద్దీ



నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

- పండుగ సెలవులు ముగియడంతో గమ్యస్థానాలకు పయనం
- ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట
- బస్సులు ఆలస్యంగా నడవడంతో ఇబ్బందులు



బస్ స్టేషన్ ఆవరణలో వేచి ఉన్న ప్రయాణికులు

**నర్సీపట్నం, జనవరి 17 :** సంక్రాంతి పండుగ సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. బుధవారం విశాఖపట్నం, తుని, చోడవరం, అనకాపల్లి రూట్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. విశాఖపట్నం రూట్‌లో ట్రాఫిక్ సమస్య కారణంగా నాన్ స్టాప్ బస్సులు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కళాశాలల సెలవులు కూడా ముగియడంతో విశాఖపట్నంలో చదువుతున్న విద్యార్థులు కూడా తిరుగు ప్రయాణం కావడంతో బస్‌స్టేషన్ ఆవరణ కిక్కిరిసిపోయింది. బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. నర్సీపట్నం- విశాఖపట్నం నాన్ స్టాప్ కౌంటర్‌లో భారీ క్యూ లైన్‌లో నిలబడి టికెట్లు తీసుకున్నారు. దీంతో విశాఖపట్నం రూట్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనంగా ప్రత్యేక బస్సులు నడిపారు. రోజు వారీగా తిరిగే బస్సులు కాకుండా విజయవాడ 4, హైదరాబాద్ 1 అదనంగా బస్సులు తిప్పుతున్నారు.

### మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

సంక్రాంతి పండుగకు వివిధ ప్రాంతాల నుంచి నర్సీపట్నం వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు బుధవారం ఒక్కసారిగా తిరుగు ప్రయాణం కావడంతో మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఆర్టీసీ కాంప్లెక్ సమీపం, శారదానగర్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విశాఖపట్నం, తుని రోడ్లు బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో కిక్కిరిసిపోయాయి.

## క్రైం... crime news

### రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి దుర్మరణం

**కశింకోట, జనవరి 17 :** రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎలమంచిలి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సుందరపు సత్తిబాబు (58) తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఎలమంచిలి నుంచి అనకాపల్లి వెళ్తుండగా నర్సింగబిల్లి వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కాగా మృతుడికి భార్య రత్నం, కొడుకు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగేశ్వరరావు చెప్పారు.

### పురుగుల మందు తాగిన యువకుడి మృతి


నూకునాయుడు (ఫైల్)

**రావికమతం, జనవరి 17 :** తండ్రి మందలించాడని పురుగుల మందు తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి. మండలంలోని దాసరయ్యపాలేనికి చెందిన యువకుడు గంటికోట నూకునాయుడు (22) తాపీ పనులు చేసేవాడు. ఇతడు తరచూ మద్యం సేవిస్తుండడంతో తండ్రి పెదకృష్ణ మందలించేవాడు. ఇదే క్రమంలో నూకునాయుడు ఈనెల ఆరో తేదీన పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తండ్రి మళ్లీ మందలించడంతో పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే తల్లిదండ్రులు ఇక్కడి ఆస్పత్రికి తీసుకు వెళ్లగా, విశాఖ కేజీహెచ్‌కు వైద్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### కొట్లాట ఘటనలో ఇద్దరిపై కేసు

**గొలుగొండ, జనవరి 17 :** కొట్లాట ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. గొలుగొండలో మంగళవారం రాత్రి సంక్రాంతి సందర్భంగా తీర్థాన్ని నిర్వహించారు. ఇక్కడి నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డులో గొలుగొండ పంచాయతీ శివారు శ్రీరాంపురం గ్రామానికి చెందిన కశింపూడి చిరంజీవి, గొలుగొండకు చెందిన కూరాకుల గంగప్రసాద్ ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో చిరంజీవి కాలుపై గాయమైనట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదులు మేరకు ఇద్దరిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఇరువర్గాల దాడి కేసులో మరో నిందితుడి అరెస్టు

**పాయకరావుపేట రూరల్, జనవరి 17 :** మండలంలోని పెదరాంభద్రపురంలో ఈనెల 11న ఇరువర్గాల మధ్య జరిగిన దాడి కేసులో మరో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పి.అప్పలరాజు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 11వ తేదీన పెదరాంభద్రపురం లో ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో గంపల నూకరాజు మృతి చెందిన విషయమై తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. ఈ కేసులో ఎ-4గా ఉన్న శీలి సూరిబాబును బుధవారం అరెస్టు చేసి కోర్టుకి తరలించామని సీఐ అప్పలరాజు తెలిపారు.

### కోడి పందాల శిబిరాలపై పోలీసుల దాడి

**ఎస్.రాయవరం, జనవరి 17:** మండలంలోని సైతారుపేటలో బుధవారం కోడి పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేసి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

**అచ్యుతాపురం :** నునపర్తి పంచాయతీ శివారు నడింపల్లిలో కోడిపందాలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు. బుధవారం కోడిపందాలు ఆడుతున్నారని సమాచారం రావటంతో సిబ్బందితో దాడి చేసి రెండు కోళ్లు, రూ.2,700 నగదుతోపాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే ఉప్పవరంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

**అనకాపల్లి రూరల్ :** మండలంలోని గోపాలపురం పంచాయతీ శివారు వెంకటరమణపేట తోటల్లో బుధవారం కోడిపందాలు నిర్వహించారు. ఇక్కడ జరుగుతున్న కోడిపందాలపై సమాచారం అందడంతో సిబ్బందిని పంపించానని, కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాల వద్దకు సిబ్బంది వెళ్లేసరికి నిర్వాహకులు పారిపోయారని రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు.

### 24 మద్యం సీసాలు స్వాధీనం

**పరవాడ, జనవరి 17 :** మండలంలోని తానాంలో పాన్‌షాపులో 24 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాన్‌షాపులో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ తేజేశ్వరరావు తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఈ దాడుల్లో 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని మూగి ధన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తేజేశ్వరరావు తెలిపారు.

### మట్టవానిపాలెంలో పార్కు చేసి ఉన్న కారు స్వాధీనం

**రావికమతం, జనవరి 17 :** మండలంలోని మట్టవానిపాలెం శివారులో గత కొద్ది రోజులుగా నిలిచి ఉన్న కారును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో కెఎ51 ఎంఎఫ్ 9938 నెంబరు గల ఈ కారు గ్రామ సమీపంలో కొద్ది రోజులుగా పార్కింగ్ చేసి ఉందన్నారు. గంజాయి వ్యాపారస్తులదేమోనన్న అనుమానంతో గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు విచారణ జరుపుతున్నామన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో స్టేషన్‌కు తరలించామని, ఈ వాహనానికి సంబంధించినవారు పూర్తి ఆధారాలు చూపి తీసుకు వెళ్లవచ్చునన్నారు.

## ఎమ్మెల్యే వాసుపల్లికి షాక్

- ఆశీల్‌మెట్టలో అనధికారికంగా నిర్వహిస్తున్న రామబాణం కళాశాలకు షోకాజ్
- రూ.2.5 లక్షల జరిమానా
- నిబంధనలకు విరుద్ధంగా మర్రిపాలెం నుంచి తరలించినట్టు గుర్తించిన ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారులు

**విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):** దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయ భవనంలో అనధికారికంగా జూనియర్ కళాశాల (రామబాణం) నిర్వహిస్తుండడాన్ని ఇంటర్ బోర్డు తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై బుధవారం 'ఆంధ్ర జ్యోతి'లో వచ్చిన కథనంపై ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సత్య నారాయణ స్పందించి, షోకాజ్ నోటీస్ జారీచేశారు. మర్రిపాలెంలోని రాణాప్రతాప్ నగర్‌లో గల ఎమ్మెల్యే నివాసం భవనంలో రామబాణం కళాశాల (కోడ్ నంబరు 02029) నడుపుతున్నారు. అక్కడ నుంచి కళాశాలను ఆశీల్‌మెట్టకు తరలించినట్టు బోర్డు అధికారులు గుర్తించారు. నిబంధనల మేరకు జూనియర్ కళాశాలను ఒక చోట నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే అనుమతి తీసుకోవాలి. కొత్తగా కళాశాల ప్రారంభించే భవనానికి అన్నిరకాల అనుమతులు పొందాలి. కానీ అవేమీ లేకుండా... కళాశాల తరలింపునకు దరఖాస్తు చేయకుండా రాణాప్రతాప్‌నగర్ నుంచి ఆశీల్‌మెట్టకు తరలించడాన్ని ఇంటర్ బోర్డు తప్పుబట్టింది. ఈ మేరకు షోకాజ్ జారీచేస్తూ 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొంది. ఇంకా రూ.2.5 లక్షల జరిమానా విధించింది. పక్షం రోజుల్లో షోకాజ్‌కు సమాధానం ఇవ్వడంతోపాటు రూ.2.5 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఒకవేళ సమాధానం ఇవ్వకపోయినా, జరిమానా చెల్లించకపోయినా ఆ కళాశాలలో చదివే విద్యార్థులను రానున్న పరీక్షలకు అనుమతించే విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని ఆర్‌ఐవో సత్యనారాయణ తెలిపారు. కాగా మధురవాడలో ప్రభ జూనియర్ కళాశాలను ఒకచోట నుంచి మరో ప్రాంతానికి అనుమతి లేకుండా తరలించినట్టు గుర్తించడంతో షోకాజ్ జారీ చేశామన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 95.00 |
| లైవ్ ధర | 115.00 |
| విత్ స్కిన్ | 200.00 |
| స్కిన్ లెస్ | 210.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 554 |
| విజయనగరం | 558 |
| శ్రీకాకుళం | 558 |

# ఎవరికీ పట్టని ఎరకన్నపాలెం!

- కనీస సౌకర్యాలు లేక గిరిజనులు అవస్థలు
- టీడీపీ హయాంలో రోడ్డుకు నిధులు మంజూరు
- వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పనులు నిలుపుదల
- ఎన్నెన్నో సమస్యలతో గిరిజన గ్రామం సతమతం


అభివృద్ధికి నోచుకోని ఎరకన్నపాలెం గ్రామం


నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రాళ్లు తేలిన రహదారి

**నాతవరం, జనవరి 17 :** దశాబ్దాలు గడుస్తున్నా గిరిజన గ్రామాల దశ మారడం లేదు. ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అవి ఏజెన్సీ పరిధిలోని పల్లెలైనా.. మైదాన ప్రాంత పరిధిలోని ఊళ్లైనా ఇదే రీతిలో ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా నాతవరం మండలం సరుగుడు పంచాయతీ శివారున గల ఎరకన్నపాలేన్ని చెప్పవచ్చు. ఈ గ్రామంలో సుమారు ఆరు వందలమంది జనాభా నివాసం ఉంటున్నారు. నేటికీ ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడం గమనార్హం. ఎన్నికల ముందు రాజకీయ పార్టీల నాయకులు రావడం, హామీలు ఇచ్చి వెళ్లడం మినహా చేపట్టిన అభివృద్ధి పనులు మాత్రం కానరావడం లేదు.

ఈ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు తిష్టవేస్తోంది. రోజుల తరబడి కదలకపోవడంతో ఓవైపు దుర్వాసన.., మరో వైపు దోమల బెడద.. వెరసి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా వరకు రోడ్లు మట్టివిగా దర్శనమిస్తున్నాయి. సరుగుడు నుంచి ఎరకన్నపాలెం మీదుగా సిరిపురం వరకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.మూడు కోట్లతో రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ సరుగుడు నుంచి ఎరకన్నపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి మధ్యలో రూ.60 లక్షల వరకు ఖర్చు చేసి మెటల్ వేయించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం నుంచి ఈ పనులను నిలిపివేయాలని ఆదేశాలు రావడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఎక్కడికక్కడ పనులను నిలిపివేశారు. ఫలితంగా రాకపోకలకు నాలుగున్నరేళ్లుగా ఎరకన్నపాలెం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ భవనంలోనే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. ఇలా ఎన్నెన్నో సమస్యలతో సతమతం అవుతున్నా తమను పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులంతా వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

## చంద్రబాబును విమర్శించే స్థాయి అమర్‌కు లేదు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

**అనకాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విమర్శించే స్థాయి లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. మంత్రి అమర్‌నాథ్ అవినీతి, భూ అక్రమాలను వైసీపీ అధిష్ఠానమే గుర్తించి ఈసారి సీటు లేకుండా చేసిందన్నారు. అవినీతిలో కూరుకుపోయిన అమర్‌నాథ్ ఉనికి కోసం టీడీపీ అధినేత చంద్రబాబుపై అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలన్నారు. మంత్రిగా అవకాశం వస్తే కనీసం నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. అవినీతి, భూదందాలతో అక్రమార్జనకు పాల్పడిన అమర్ సంగతి తెలుసుకున్న వైసీపీ అధిష్ఠానం పట్టించుకోవడం లేదన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టించిన వైసీపీ ప్రభుత్వం సీఐడీ అధికారులు కోర్టులో కనీసం ఆధారాలు చూపలేకపోయిందన్నారు. జగన్‌రెడ్డిపై 11 సీబీఐ కేసులు, ఆరు ఈడీ కేసులు, 32 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. సొంత చిన్నాన్న వివేకానంద హత్య వెనుక జగన్ కుట్ర దాగివుందని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో దళితులు, బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారని, ఎన్నికలు సమీపిస్తుండడంతో అంబేడ్కర్ జపం చేస్తున్నారని విమర్శించారు. అట్టడుగు వర్గాల యువత నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతుందన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఏపీ 24వ ర్యాంకు సాధించిందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనుభవజ్ఞుడైన చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దనాల విష్ణు చైదరి, సాలపు నాయుడు, వెంకటరావు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఆందోళన

- వడ్డాది కూడలిలో బాధితుడి వర్గీయులు నిరసన
- గంటపాటు స్తంభించిన ట్రాఫిక్
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ


వడ్డాది కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న బాధితుడి వర్గీయులు

**బుచ్చెయ్యపేట, జనవరి 17 :** కోడి కత్తితో దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కూడలిలో బాధితుడి వర్గీయులు ఆందోళన చేపట్టారు. కోడి పందాల శిబిరం వద్ద మంగళవారం వడ్డాదికి చెందిన యువకుల మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదం చిలికి చిలికి గాలివానగా మారడంతో కత్తిపోటుకు దారి తీసిన విషయం తెలిసిందే. రెల్లి వీధికి చెందిన బొర్రా తేజపై స్థానిక దొరబాబు కాలనీకి చెందిన శ్రీరామ్ వర్గీయులు కోడి కత్తితో దాడి చేసి గాయపరిచినా నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ రెల్లి వీధికి చెందినవారు పెద్ద సంఖ్యలో వడ్డాది కూడలిలో ఆందోళనకు దిగారు. మానవహారం నిర్వహించిన నిరసన తెలిపారు. దీంతో నాలుగు రోడ్లలో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, చోడవరం సీఐ శ్రీనివాసరావు, బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి.ఈశ్వరరావులు ఆందోళన విరమించాలని పలు పర్యాయాలు కోరినా నిందితులను అరెస్టు చేసే వరకు విరమించలేదని వారంతా స్పష్టం చేశారు. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు కూడలి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళన చేస్తున్న కాలనీ వాసులతో మాట్లాడారు. కత్తితో దాడి చేసిన నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని వారంతా ప్రశ్నించారు. నిందితులు పరారీలో ఉన్నందున అరెస్టులో జాప్యం ఏర్పడిందన్నారు. నిందితులను అరెస్టు చేసే వరకు తమ ఆందోళన విరమించేది లేదని వారు పునరుద్ఘాటించారు. ట్రాఫిక్ జామ్ కావడంతో నాలుగు రోడ్లలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఆందోళనకారులకు డీఎస్పీ వివరించారు. సాయంత్రంలోగా నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఇచ్చిన సమయంలోగా అరెస్టు చేయకపోతే తాము ఆందోళనను తిరిగి చేపడతామని కాలనీవాసులు తెలిపి విరమించారు. భూపతిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరామ్ మరో ఆరుగురిపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని డీఎస్పీ సుబ్బరాజు విలేకరులకు తెలిపారు. కాగా ఫిర్యాదులో పేర్కొన్న ఏడుగురు నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.


ఆందోళన విరమించాలని కోరుతున్న డీఎస్పీ సుబ్బరాజు

## 'రక్తదానం ప్రాణదానంతో సమానం'



రక్తదానం చేస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

**అనకాపల్లి టౌన్, జనవరి 17 :** రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. సామాజిక సమతా సంకల్పం మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఎన్టీఆర్ వైద్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసినట్టయితే మన శరీరంలో రక్తం తగ్గకపోగా కొత్త రక్తం చేరుతుందన్నారు. ఆరోగ్యవంతులైన వారందరూ రక్తదానం తప్పక చేయాలన్నారు. ఈ శిబిరంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, పలువురు అధికారులు రక్తదానం చేయగా.. వారందరికీ కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. హేమంత్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ అజయ్‌బాబు, డీవీఎంసీ సభ్యుడు బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, సామాజిక సమతా సంకల్పం మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక మెయిన్‌రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి చిన్నారులు కూచిపూడి, జానపద నృత్యాలను చేసి అతిథులను ఆనందపరిచారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తిలకించి కళాకారులను అభినందించారు. వర్షా అపర్ణ చేసిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారులను జిల్లా అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, సచివాలయాల ప్రత్యేకాధికారిణి మంజులాదేవి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## '22న ఓటర్ల తుది జాబితా'

**అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 17 :** జిల్లా ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22వ తేదీన ప్రకటించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించడం జరిగిందని, 26 కేంద్రాల్లో దివ్యాంగులకు సంబంధించి ర్యాంప్‌లను నిర్మించాల్సి ఉందన్నారు. త్వరలోనే వాటి నిర్మాణానికి సంబంధిత అధికారులతో పనులు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఓటర్ల అవగాహన సదస్సులను 914 ప్రదేశాల్లో నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 459 ప్రాంతాల్లో నిర్వహించామన్నారు. ఎన్నికల ప్రక్రియలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా రాజకీయపార్టీల ప్రతినిధులు వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఈనెల 25న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయానిధి, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మిలాన్-2024కు పటిష్ఠ ఏర్పాట్లు

- వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండు దశలలో నిర్వహణ
- హాజరుకానున్న ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, ముఖ్యమంత్రి
- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

**విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):** నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్రంగా వచ్చే నెల 19 నుంచి 27 వరకు రెండుదశలలో జరగనున్న మిలాన్-2024 వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం నేవీ, ఎయిర్‌పోర్టు, పోర్టు, కస్టమ్స్, రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, పర్యాటక అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలు చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మిలాన్ -2024 ఇన్‌చార్జి, నేవల్ కమాడోర్ నీరజ్ అజాద్ మిలాన్ 12వ ఎడిషన్ కార్యక్రమాలను వివరించారు. వచ్చే నెల 19 నుంచి 23 వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27 వరకు సీ(సముద్రం) ఫేజ్ కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ, విదేశాల నుంచి అతిథులు వస్తున్నారన్నారు. ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు వేడుకల్లో భాగస్వామ్యమవుతాయన్నారు. వచ్చే నెల 18,19 తేదీల్లో దేశ, విదేశాల నుంచి వచ్చే నౌకలు పోర్టు, నేవల్ డాక్‌యార్డుకు చేరుకుంటాయని, 19న విదేశ ప్రముఖులు నగరానికి వస్తారన్నారు. 21న ప్రధాన కార్యక్రమాలకు కేంద్ర రక్షణమంత్రి హాజరవుతారన్నారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్‌ను రక్షణమంత్రి ప్రారంభిస్తారని, 22న సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి హాజరవుతారన్నారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతాయని నీరజ్ అజాద్ పేర్కొన్నారు.

అనంతరం కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వేడుకలకు ప్రముఖులు రానున్నందున రక్షణ, బందోబస్తు ఏర్పాట్లు చూడాలని పోలీసులను ఆదేశించారు. వేడుకలు వీక్షించేందుకు బీచ్‌లో బారికేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. బీచ్ ఏరియాలో సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీలు ఏర్పాటుచేయాలని, ఏపీఐఐసీ, ఏయూ మైదానంలో వాహనాలకు పార్కింగ్, విశ్వప్రియ ఫంక్షన్‌హాలు, విశాఖ మ్యూజియంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

మిలాన్ జరిగే సమయంలో సముద్రంలో ఎటువంటి కార్యక్రమాలు లేకుండా చూడాలని మత్స్యశాఖ జేడీని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నేవీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మిలాన్‌లో భాగంగా సిటీ పరేడ్ సందర్భంగా బీచ్‌రోడ్డులో శకటాల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో తూర్పు నావికాదళానికి చెందిన ఉన్నతాధికారి రాజ్‌నీష్‌శర్మ, నేవీ కమాండర్లు, డీసీపీ శ్రీనివాసరావు, డీఆర్వో కె.మోహన కుమార్, ఆర్డీవో హుస్సేన్‌సాహేబ్, అధికారులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌లో డిజిటల్ ఎలక్ట్రానిక్ ల్యాబ్ ప్రారంభం

**మహారాణిపేట, జనవరి 17:** కేజీహెచ్‌లో రోగుల డిజిటలైజేషన్ ఎలక్ట్రానిక్ ల్యాబ్ రిపోర్టుల ప్రక్రియ ప్రారంభమైంది. ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల వద్ద బుధవారం డిజిటలైజేషన్ ఎలక్ట్రానిక్ ల్యాబ్‌లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు రక్త, ఇతర వైద్య పరీక్షలను చేయించుకున్న అనంతరం ల్యాబ్ నుంచి రిపోర్టులు సంబంధిత వైద్య విభాగాలకు హాస్పిటల్ లాగిన్ ద్వారా చేరుతాయన్నారు. వాటిని వైద్యులు కంప్యూటర్‌లో నేరుగా చూస్తారన్నారు. దీని వల్ల రోగులు రిపోర్టుల అవసరం లేకుండా నేరుగా వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసి, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో వైసీపీకి కార్పొరేటర్లు రాజీనామా

- బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్
- పార్టీని నమ్ముకున్న వారికి జగన్ న్యాయం చేయడం లేదని ఆరోపణ
- పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసినా పట్టించుకోలేదని విమర్శ


మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్, పక్కన వైసీపీ కార్పొరేటర్లు

**విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థలో వైసీపీ కార్పొరేటర్లు పలువురు త్వరలో ఆ పార్టీకి రాజీనామా చేయనున్నారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఆయన బుధవారం దసపల్లా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణరావు, బిపిన్‌కుమార్ జైన్, చెన్నా జానకీరామ్, విల్లూరి భాస్కరరావు (వైసీపీ మద్దతుదారు)లతో కలిసి మాట్లాడారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ అభివృద్ధిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీని నమ్ముకున్న వారికి జగన్ న్యాయం చేయడం లేదని, దానికి తానే ప్రత్యక్ష నిదర్శనమని సుధాకర్ అన్నారు. జగన్ తండ్రి రాజశేఖరరెడ్డి వద్ద, ఆయన తల్లి విజయలక్ష్మి వద్ద కూడా తాను ఎన్నికల సమయాల్లో చాలా కీలకంగా పనిచేశానన్నారు. 2014 ఎన్నికల్లో వైసీపీ వైఫల్యంపై ఉత్తరాంధ్ర స్థాయి నాయకులందరినీ పిలిచి సమీక్ష సమావేశం నిర్వహించానని, కొన్ని కోట్ల రూపాయలు పార్టీ కోసం ఖర్చు చేశానన్నారు. అయితే తనది వన్ సైడ్ లవ్‌గానే ఉండిపోయిందని, న్యాయం జరగలేదని, అందుకే ఆ పార్టీకి, ఆ పార్టీ ఇచ్చిన బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చానన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా న్యాయం జరగలేదనే బయటకు వచ్చారన్నారు. తామంతా కలిసి విశాఖలో వైసీపీ నుంచి నాయకులను బయటకు తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలోనే తాను వేరే పార్టీలో చేరతానని, అయితే అది కాంగ్రెస్ పార్టీ మాత్రం కాదని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి తన కాలేజీలో సంక్రాంతి సందర్భంగా పార్టీ కేడర్‌కు మద్యం, కోళ్ల పంపిణీ చేయించారని, ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదన్నారు. ఆ మద్యం అంతా చీప్ లిక్కర్ అని, రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలే ఆ చీప్ లిక్కర్ తయారుచేయించి అమ్మిస్తున్నారని ఆరోపించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గణపర్తిలో పూర్వ విద్యార్థులు కలుసుకున్న దృశ్యం

**మునగపాక, జనవరి 17:** మండలంలోని గణపర్తిలో 1993-94 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కలుసుకుని సందడి చేశారు. నాటి ముచ్చట్లు నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు మాధవరావు, ప్రభాకర్, బాబూరావు, ఈశ్వరమ్మ, పద్మావతి, జనార్దన్, భాస్కరరావులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

## అంగన్‌వాడీలకు ఇచ్చిన షోకాజ్‌లు ఉపహరించుకోవాలి

**కశింకోట, జనవరి 17 :** అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగశేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ వారం రోజుల నుంచి షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తలు షోకాజ్ నోటీసులతో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు.

## నక్కపల్లిలో నంది ఉత్సవం

**నక్కపల్లి, జనవరి 17:** మండల కేంద్రంలో బుధవారం నంది పండుగ ఘనంగా జరిగింది. ఇక్కడ ఉన్న నంది విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో తీర్థం సాగింది.

## 30 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక



పాయకరావుపేటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**పాయకరావుపేట, జనవరి 17 :** స్థానిక ఒక ప్రైవేటు స్కూల్లో 30 సంవత్సరాల క్రితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. పట్టణంలోని సన్‌ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో 1993లో పదో తరగతి చదువుకుని ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 20 మంది పూర్వ విద్యార్థులు ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని స్వస్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం కుటుంబ సభ్యులతోపాటు కలుసుకుని ఆటపాటలతో సందడి చేశారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు.

## జీపీడీపీపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

**ఎస్. రాయవరం, జనవరి 17:** మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ గుడివాడ పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడు అవగాహన కల్పించారు. సర్పంచులంతా ప్రణాళికలు తయారుచేసుకోవాలంటూ పలు విషయాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రామరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

## సైతారుపేటలో ముగ్గుల పోటీలు



సైతారుపేటలో మహిళలు వేసిన ముగ్గులు

**ఎస్.రాయవరం, జనవరి 17:** మండలంలోని సైతారుపేటలో బుధవారం జరిగిన తీర్థం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. మధ్యాహ్నం తర్వాత జరిగిన తీర్థంలో స్థానికులు సందడి చేశారు.

## మహిళల సృజనాత్మకతకు రంగ వల్లులు ప్రతీక



విజేతలకు బహుమతులు అందజేస్తున్న లక్ష్మీశివకుమారి

**కోటవురట్ల, జనవరి 17:** మహిళ సృజనాత్మకతకు, కళా నైపుణ్యానికి రంగ వల్లులు ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీశివకుమారి అన్నారు. సంక్రాంతి పండుగల సందర్భంగా బుధవారం సుంకపూర్‌లో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ

**కోటవురట్ల, జనవరి 17:** సంక్రాంతి పండుగ సందర్భంగా కోటవురట్ల, కైలాసపట్నం గ్రామాల్లో పేదలకు నిత్యావసర సరకులను విశాఖపట్నంనకు చెందిన లలితా ప్లాస్టిక్స్ అధినేత శాంతిలాల్ పులలియా పంపిణీ చేశారు. రైస్‌బ్యాగ్, పెసరపప్పు, పంచదార, కందిపప్పు, బెల్లం, స్వీట్‌బ్యాకు, కూరగాయలను జడ్పీటీసీ సభ్యులు ఉమాదేవి, సిద్దాబత్తుల సత్తిబాబు, నాగేశ్వరరావు, తుమ్మలపల్లి ఆంజనేయులు అందజేశారు.

## ఎంజేపురంలో ప్రతి ఇంటిపై రాముని జెండాలు

**అచ్యుతాపురం, జనవరి 17:** అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని ఎంజేపురంలో ప్రతీ ఇంటిపై రాముని జెండాలు ఎగురవేయాలని గ్రామస్థులు నిర్ణయించారు. బుధవారం సాయంత్రం అయోధ్య శ్రీరాముని అక్షింతలతో పాటు జెండాలను పంపిణీ చేశారు.

## డీఆర్‌డీఏలో అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలి

**▸ ప్రజా సంకల్ప వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ**

**కొత్తూరు, జనవరి 17:** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని ప్రజా సంకల్ప వేదిక జిల్లా అధ్యక్షుడు ముప్పిన వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయలు నకిలీ ఎస్‌హెచ్‌జీల్లో అక్రమాలు జరిగి పక్కదారి పట్టాయని ఆరోపించారు. దీనిపై తక్షణమే విచారణ చేపట్టి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నకిలీ ఎస్‌హెచ్‌జీ సంఘాలు, బ్యాంకు ప్రతినిధులతో లాలూచీ పడి రూ.8కోట్లు పక్కదారి పట్టాయని జిల్లా కలెక్టర్ ఫిర్యాదు కూడా చేశామన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టి ముగ్గురు సీసీలను సస్పెండ్ చేశారని తెలిపారు. తాజాగా కశింకోటలో డీసీసీబీ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీవీబీ బ్యాంకుల్లో నకిలీ ఎస్‌హెచ్‌జీలు గ్రూపులు పెట్టి కోట్లాది రూపాయలు కాజేసినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ బ్యాంకుల ద్వారా జరిపిన రుణ బదిలీలపై సమగ్రవిచారణ చేపట్టాలని ఆయన కోరారు.

# పలు గ్రామాల్లో ఘనంగా తీర్థాలు



కొత్తూరు: కుంచంగిలో సీతారాముల తీర్థంలో పాల్గొన్న భక్తులు



అనకాపల్లి టౌన్: సీతారాములను దర్శించుకున్న పీలా గోవింద, దాడి రత్నాకర్

**అనకాపల్లి టౌన్, జనవరి 17 :** స్థానిక గవరపాలెం సంతబయలులో పెదరామస్వామి తీర్థం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. తెలుగుదేశంపార్టీ యువ నాయకుడు దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో తీర్థం ఘనంగా జరిగింది. పెదరామస్వామి ఆలయంలో సీతారాములను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, భక్తులు దర్శించుకున్నారు. తీర్థంలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, చెక్క భజనలు, తప్పెటగుళ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి తొమ్మిది గంటలు దాటినా తీర్థంలో సందడి కొనసాగింది.

**కొత్తూరులో..** మండలంలోని కుంచంగిలో సీతారాముల తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఎడ్ల పరుగుల పందెం నిర్వహించారు. సాయంత్రం రామాలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి, వైసీపీ నాయకుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**తుమ్మపాలలో..** అనకాపల్లి మండలం మార్టూరులో సీతారాముల తీర్థం సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి గుర్రపు పందాలు నిర్వహించారు. ఈ పందాలను అనకాపల్లి వైసీపీ సమన్వయకర్త మలసాల భరత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మలసాల భరత్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే తీర్థాలు భారతీయ సంస్కృతికి చిహ్నాలు అని అన్నారు. తొలుత రామాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మిద్దె రాజా చంద్రరావు, గ్రామ నాయకులు కరణం నూకునాయుడు, కరణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**సబ్బవరంలో..** మండలంలోని బంగారమ్మపాలెం, పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం గ్రామాల్లో బుధవారం సీతారాముల వారి తీర్థం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచే గ్రామస్థులు సీతారాములకు పూజలు చేశారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాముగరిడీలు, చిడతల భజనలు, కోలాటాలు, చిటికెన భజనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో సర్పంచ్ దాడి లావణ్య, మాజీ సర్పంచ్ దొడ్డి అప్పారావు, టీడీపీ నాయకులు దాడి కన్నంనాయుడు, సబ్బవరపు బుజ్జి పాల్గొన్నారు.

**పరవాడలో..** మండల కేంద్రంలో బుధవారం శ్రీరాముని తీర్థం వైభవంగా నిర్వహించారు. భక్తులు సీతారాములకు పూజలు నిర్వహించారు. సాయంత్రం తీర్థంలో ఏర్పాటు చేసిన సాముగరిడీలు, చిడతలు, కోలాటాలు, తప్పెటగుళ్లు అందరిని అలరించాయి. పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో తీర్థం ఘనంగా జరిగింది.



తుమ్మపాల: మార్టూరులో జెండా ఊపి గుర్రపు పోటీలను ప్రారంభిస్తున్న భరత్



పరవాడ తీర్థంలో కోలాటం ఆడుతున్న మహిళలు

## కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



రాంబిల్లిలో ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

**అనకాపల్లి టౌన్, జనవరి 17 :** సమస్యలు పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం 37వ రోజు కొనసాగింది. సుప్రీంకోర్టు సూచన మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, నెలకు రూ. 26వేలు వేతనం చెల్లించాలని, మెనూ చార్జీలు పెంచాలని అంగన్‌వాడీలు నినాదాలిచ్చారు. జిల్లా అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానాలు కూడా ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**మునగపాకలో..** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు బుధవారం వినూత్న రీతిలో ఆకులు నములుతూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ శిబిరాన్ని డీవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శివాజీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందంగా సంక్రాంతి జరుపుకోవాల్సిన అంగన్‌వాడీలు శిబిరాలకు పరిమితం కావడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బ్రహ్మాజీ, జయలక్ష్మీ, రామలక్ష్మి, హేమలత, అంజలి పాల్గొన్నారు.

**రాంబిల్లిలో..** తమ న్యాయమైన డిమాండ్లును పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీల చేస్తున్న ఆందోళన బుధవారానికి 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఆకులను తింటూ వినూత్నరీతిలో నిరసన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా అంగన్‌వాడీల సమస్యలను ఇన్నిరోజులైన పరిష్కరించకుండా కాలయాపన చేయలేదన్నారు. సీఎం జగన్‌రెడ్డి అంగన్‌వాడీలను ఇలా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీల నాయకులు పాల్గొన్నారు.

**సబ్బవరంలో..** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 37 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సబ్బవరం, పరవాడ మండలాల అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయకుంటే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఎం నేత బాలకృష్ణకు ఘన నివాళి



బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రత్నాకర్



బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

**అనకాపల్లి టౌన్, జనవరి 17 :** సీపీఎం సీనియర్ నేత ఎ. బాలకృష్ణ మృతి అనకాపల్లిలో ఉద్యమానికి తీవ్ర లోటని వక్తలు పేర్కొన్నారు. చిన్నతనం నుంచి అభ్యుదయ భావాలతో బాలకృష్ణ పెరిగారని, ఆయన జీవిత గమనం వామపక్ష ఉద్యమాలతో మమేకమై సాగిందన్నారు. కార్మిక వ్యవసాయ, రైతు ఉద్యమాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. గవరపాలెంలోని నివాసం వద్ద బాలకృష్ణ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐఎంఎల్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్, సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం, కాంగ్రెస్ నాయకుడు ఐఆర్ గంగాధర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.హరిబాబు, సీఐటీయూ నాయకులు ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్, జి. కోటేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు.

## జ్యోతిబసుకు ఘన నివాళులు



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

**అనకాపల్లి టౌన్, జనవరి 17 :** భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 14వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకులు ఆర్. శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతిబసు చిత్రపటానికి సీపీఎం నాయకులు కె. లోకనాథం, జి. కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా జ్యోతిబసు ఐదు సార్లు పనిచేసి, రికార్డు సొంతం చేసుకున్నారన్నారు. ఆయన కమ్యూనిస్టుపార్టీకి, పేద, బడుగు, బలహీనవర్గాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, కె. తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మరాజుపేటలో ఘనంగా సంక్రాంతి సంబరాలు




సినీ డైరెక్టరు నక్కిన త్రినాథరావును సన్మానిస్తున్న తిమ్మరాజుపేట గ్రామస్థులు

**మునగపాక, జనవరి 17 :** మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం రాత్రి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు, సినీ, టీవీ నటుడు బాలాజీ, ప్రసన్నకుమార్ రెడ్డి తదితరులు హాజరై ఆటపాటలలో పాల్గొని గ్రామస్థులను అలరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ తన జన్మభూమిలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనకాపల్లిలోనే పుట్టి, ఇక్కడే చదువుకుని, ఈప్రాంతమంతా స్నేహితులతో కలిసి తిరిగానని గుర్తు చేసుకున్నారు. 1983లో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి అనేక చిత్రాలలో నటించానని, ఇపుడు పలు టీవీ సీరియల్స్‌లో నటిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్రసన్నకుమార్ రెడ్డి, విద్యార్థినులతో కలిసి ఆట పాటలలో పాల్గొన్నారు. దర్శకుడు నక్కిన త్రినాథరావు మాట్లాడుతూ మునగపాక తన సొంత మండలం అని, ఈ గ్రామంలో అనేకమంది తన బాల్య మిత్రులు ఉన్నారన్నారు. అనంతరం గ్రామస్థులు వీరిని ఘనంగా సన్మానించారు.

## గంగవరంలో గ్రావెల్ దోపిడీ

... 3వ పేజీ తరువాయి

గ్రావెల్, లేఅవుట్‌లోని మట్టిని దర్జాగా తరలించుకుపోతున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే లేఅవుట్ అభివృద్ధికి తరలిస్తున్నామని చెబుతున్నారు. రాత్రి వేళల్లో అయితే ఇక అడ్డూ అదుపు లేకుండా తవ్వి తరలించేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు కేసు పెట్టలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాగా గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇస్తే తమపైనే చిందులు తొక్కుతున్నారని గంగవరం గ్రామస్థులు వాపోతున్నారు.

**ప్లాట్ల యజమానుల పాట్లు**

గోపాలపట్నం, గాజువాక, విశాఖపట్నం సిటీ, పోతినమల్లయ్యపాలెం తదితర ప్రాంతాలకు చెందిన పేదవారిని గుర్తించి ప్రభుత్వం గంగవరంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే లేఅవుట్ ధ్వంసం చేసి గ్రావెల్, మట్టిని అక్రమార్కులు తరలించుకుపోవడంతో వారి ప్లాట్ నంబర్ ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులు పాట్లు పడుతున్నారు. ఎవరికి చెప్పుకోవాలని తెలియక ఆందోళన చెందుతున్నారు.

**తహసీల్దార్ ఫిర్యాదు చేసినా...**

గంగవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు తెలుసుకుని గత ఏడాది ఆగస్టులో తహసీల్దార్ బి.సత్యనారాయణ విచారణ జరిపారు. వలంటీర్‌తో పాటు మరో ఎనిమిది మంది వైసీపీ నాయకులు ఈ తవ్వకాల వెనుక ఉన్నట్టు గుర్తించి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే వారిలో ఒక్కరిపై కూడా పోలీసులు కేసు పెట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలను ఆపాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని గంగవరం గ్రామస్థులు కోరుతున్నారు.

## సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చేదెన్నడో?

... 3వ పేజీ తరువాయి

పంపారు. అక్కడ నుంచి అనుమతులు రాకపోవడంతో సిటీస్కాన్ గదిని ఎప్పటిలాగానే తాళం వేసి ఉంచారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు వివరణ కోరగా సిటీస్కాన్ కోసం సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సిబ్బందిని నియమించి సిటీస్కాన్ సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

## వీసీ ప్రసాదరెడ్డే

... 3వ పేజీ తరువాయి

ప్రసాదరెడ్డికి వీసీగా మళ్లీ అవకాశం ఇవ్వవద్దని సూచించినట్టు తెలిసింది. అయితే రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పట్టుబట్టి ప్రసాదరెడ్డికి వీసీ పదవి ఇప్పించారని అంటున్నారు. విశాఖపట్నంలో ఆయనకు మంచి టీమ్ ఉందని, సర్వేలు పక్కాగా నిర్వహిస్తారని, పార్టీకి విశ్వాసంగా పనిచేస్తారని, ఆభరోసాతోనే మళ్లీ నియమిస్తున్నామని బొత్స తదితరులకు సర్దిచెప్పారని అంటున్నారు.

**ముందు నుంచి అదే పాట**

ప్రసాదరెడ్డే మళ్లీ వీసీగా వస్తారని ఏయూలో కీలక అధికారులు ముందు నుంచి చెబుతూనే ఉన్నారు. అందుకే ఇన్‌చార్జి వీసీని నియమించినా ఆమెకు వెంటనే ఛాంబర్, కారు ఇవ్వలేదు. అలాగే ఏ నిర్ణయమైనా ఆమెకు చెప్పకుండా చేసుకుంటూ పోయారు. వీటిపై ఎన్ని విమర్శలు వచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. 'రెండు రోజులు ఆగండి...సారే మళ్లీ వస్తారు' అంటూ అందరికీ చెప్పుకొచ్చారు. ఇప్పుడు అదే నిజమైంది. ఇది ఎన్నికల సమయం కావడం, ప్రసాదరెడ్డి మళ్లీ వీసీగా రావడంతో ఏయూ రాజకీయ కార్యకలాపాలకు కీలకం కానుంది. ఎన్నికల సంఘం అధికారులు దీనికి ఏ విధంగా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



మునగపాక ఆసుపత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

**మునగపాక, జనవరి 17 :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టీబీ, హెచ్ఐవీ అధికారి డాక్టర్ కిషోర్ కుమార్ తనిఖీ చేశారు. రోగులకు అందే వైద్యసేవలు, పరీక్షలు, మందులు గురించి అడిగి తెలుసుకున్నారు.జాతీయ కార్యక్రమాలు శతశాతం పూర్తి చేయాలని, లెప్రసీ సర్వే పూర్తి చేసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి షబ్నం, సీహెచ్‌వో ఆర్. దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, సిబ్బంది రాజేశ్వరి, తులసి, శిరీష, దేవకి పాల్గొన్నారు.

## మండలంలో ఐదు గంటలు పవర్ కట్ రేపు

**పాయకరావుపేట, జనవరి 17 :** పాయకరావుపేటలోని విద్యుత్ ఉప కేంద్రంలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేటలోని 132/133 విద్యుత్ ఉప కేంద్రంలో శుక్రవారం ఉదయం వార్షిక మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి 2 గంటల వరకు పాయకరావుపేట పట్టణంతోపాటు 24 పంచాయతీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

## హతుడు కుటుంబానికి ప్రభుత్వ సాయం

**▸ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హామీ**



నూకరాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు

**పాయకరావుపేట రూరల్, జనవరి17 :** మండలంలోని పెదరాంభద్రపురంలో ఈనెల 11వ తేదీన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మృతి చెందిన గంపల నూకరాజు కుటుంబ సభ్యులను, గాయపడిన వారిని బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. పార్టీ నాయకులు వైవీ. సుబ్బారెడ్డి, సీఎం. జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూసి నూకరాజు కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యనారాయణ, వైసీపీ నాయకులు యిసరపు తాతారావు, త్రిపర్ణ సత్యనారాయణ, త్రిపర్ణ శ్రీను పాల్గొన్నారు.

## పట్టణ సీఐగా శంకరరావు బాధ్యతల స్వీకారం



బాధ్యతలు చేపట్టిన సీఐ శంకరరావు

**అనకాపల్లి టౌన్, జనవరి 17 :** పట్టణ సీఐగా జి. శంకరరావు బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ రూరల్ సర్కిల్ సీఐగా పనిచేయగా.. ఇటీవల డీఐజీ చేసిన బదిలీల్లో అనకాపల్లికి నియమితులయ్యారు. దీంతో ఆయన సాయంత్రం స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. అంతకుముందు స్థానిక నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన దాడి మోహనరావు రాజాంకు బదిలీ అయ్యారు.

## టిడ్కో గృహ సముదాయంలో సమస్యల పరిశీలన

**ఎలమంచిలి, జనవరి 17 :** మునిసిపాలిటీ రామ్‌నగర్ సమీపంలోని నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో నెలకొన్న తాగునీరు, డ్రైన్ వాల్వ్‌లు, లీకేజీల సమస్యలను పరిష్కరిస్తామని డీఈఈ వీరయ్య అన్నారు. బుధవారం టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. తాగునీటి వాల్వ్‌లు సమస్య పరిష్కరించాలని, కిచెన్ పైపులైన్ల వాల్వ్‌లు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుందని, పైపులైన్ల ద్వారా లీకేజీలు ఏర్పడుతున్నాయని నివాసితులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పలు సమస్యల పరిష్కారానికి టిడ్కో అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కాలనీలో ఇప్పటికే చెత్త డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేశామని, మరిన్ని సదుపాయాలు కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

## 'ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి'

**ఎలమంచిలి, జనవరి 17 :** ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. బుధవారం మునిసిపాలిటీ తెరువుపల్లిలో సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ కొండబాబు, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అల్లెపు గుప్తా కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రైతుల నిరసన దీక్ష

**పరవాడ, జనవరి 17 :** మండల కేంద్రంలో పెద్ద చెరువు ఆయకట్టు రైతులు చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం నాటికి 39వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు రాంకీ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ ఆందోళనలో ఆయకట్టు రైతులు పైలా నాయుడు, సిరపురపు శ్రీనివాసరావు, సీహెచ్. గోపి, ఎస్ఎస్ నాయుడు, రామునాయుడు పాల్గొన్నారు.

## 'మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం'



విలేకరులతో మాట్లాడుతున్న గొర్లె రామునాయుడు

**సబ్బవరం, జనవరి 17 :** ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశ సుస్థిర అభివృద్ధి సాధ్యమని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. స్థానిక దుర్గమాంబ ఆలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఎటువంటి ఆటంకాలు లేకుండా జరగాలని కోరుతూ ప్రతి ఇంటి వద్ద రాత్రి 7 గంటలకు దీపాలు వెలిగించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గొటివాడ, బంగారమ్మపాలెంల్లో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు సాలాపు మీన, దాడి లావణ్య బీజేపీ నేతలు వనం సత్యనారాయణ, రెడ్డి రామునాయుడు, నరసింగరావు, సత్యరావు పాల్గొన్నారు.

## కొండకర్లలో మన ఊరు.. మన ఆట

**అచ్యుతాపురం, జనవరి 17:** జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ సహకారంలో కొండకర్లలో మన ఊరు.. మన ఆట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు భైలపూడి శ్రీరామదాసు, పి.సత్యనారాయణ, పి.రమణ, ఎస్. నాగార్జున, సుంకర దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

- నాతవరంలో మూడు నెలల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహణ
- చివరి రోజు వివిధ రకాల పిండి వంటలతో సారె సమర్పణ
- అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లిన నిమజ్జనం


గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు

**నాతవరం, జనవరి 17 :** మండల కేంద్రం నాతవరంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. విజయదశమి నాడు ఈ వేడుక ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు ఆదిదంపతులకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజున మహిళలు వివిధ రకాల పిండి వంటలను ఇళ్లలో తయారు చేసి, పళ్లాల్లో పేర్చి ఊరేగింపుగా గౌరీపరమేశ్వరులు కొలువుదీరిన రామాలయానికి చేరుకున్నారు. అక్కడ వాటిని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం 30 ఎడ్ల బండ్లపై అంతా కలిసి మేళతాళాలు, బాజాభజంత్రీలు, బాణసంచాతో పెద్ద చెరువు వద్దకు వెళ్లి అక్కడ నిమజ్జనం చేశారు. ఆ తరువాత అక్కడ మహిళలకు భోజనాలు ఏర్పాటు చేశారు ఉత్సవ నిర్వాహకులు కరక అప్పలరాజు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


గౌరమ్మకు సారెను ఊరేగింపుగా తీసుకు వెళుతున్న మహిళలు

## మాడుగులలో ముగిసిన సంక్రాంతి సంబరాలు


వివిధ వేషధారణలతో అలరిస్తున్న బాలబాలికలు

**మాడుగుల/రూరల్, జనవరి 17:** భారత నిర్మాణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి. ఇక్కడి శతకంపట్టు వద్ద భోగినాడు మొదలుకొని కనుమ రోజు రాత్రి వరకూ జరిగిన ఈ వేడుకల్లో గాలిపటాలు, మండలస్థాయి షటిల్ టోర్నమెంట్, చిన్నారులతో సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, పాటల పోటీలు, పద్యాలు, నృత్య కార్యక్రమాలు ఇలా ఎన్నెన్నో నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

## పాకలపాడు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సందడి


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**గొలుగొండ, జనవరి 17:** మండలంలోని పాకలపాడు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు బుధవారం సందడి చేశారు. 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా కలుసుకోవడంతో ఇక్కడ కోలాహల వాతావరణం నెలకొంది. నాటి మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుని అంతా మురిసిపోయారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు సరదగా గడిపారు.

## సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి...?

... 3వ పేజీ తరువాయి

పంపారు. అక్కడ నుంచి అనుమతులు రాకపోవడంతో సిటీస్కాన్ గదిని ఎప్పటిలాగానే తాళం వేసి ఉంచారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు వివరణ కోరగా సిటీస్కాన్ కోసం సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సిబ్బందిని నియమించి సిటీస్కాన్ సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

## వీసీ ప్రసాదరెడ్డే

... 3వ పేజీ తరువాయి

ప్రసాదరెడ్డికి వీసీగా మళ్లీ అవకాశం ఇవ్వవద్దని సూచించినట్టు తెలిసింది. అయితే రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పట్టుబట్టి ప్రసాదరెడ్డికి వీసీ పదవి ఇప్పించారని అంటున్నారు. విశాఖపట్నంలో ఆయనకు మంచి టీమ్ ఉందని, సర్వేలు పక్కాగా నిర్వహిస్తారని, పార్టీకి విశ్వాసంగా పనిచేస్తారని, ఆభరోసాతోనే మళ్లీ నియమిస్తున్నామని బొత్స తదితరులకు సర్దిచెప్పారని అంటున్నారు.

### ముందు నుంచి అదే పాట

ప్రసాదరెడ్డే మళ్లీ వీసీగా వస్తారని ఏయూలో కీలక అధికారులు ముందు నుంచి చెబుతూనే ఉన్నారు. అందుకే ఇన్‌చార్జి వీసీని నియమించినా ఆమెకు వెంటనే ఛాంబర్, కారు ఇవ్వలేదు. అలాగే ఏ నిర్ణయమైనా ఆమెకు చెప్పకుండా చేసుకుంటూ పోయారు. వీటిపై ఎన్ని విమర్శలు వచ్చినా వారు వెనక్కి తగ్గలేదు. 'రెండు రోజులు ఆగండి...సారే మళ్లీ వస్తారు' అంటూ అందరికీ చెప్పుకొచ్చారు. ఇప్పుడు అదే నిజమైంది. ఇది ఎన్నికల సమయం కావడం, ప్రసాదరెడ్డి మళ్లీ వీసీగా రావడంతో ఏయూ రాజకీయ కార్యకలాపాలకు కీలకం కానుంది. ఎన్నికల సంఘం అధికారులు దీనికి ఏ విధంగా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

## గంగవరంలో గ్రావెల్ దోపిడీ

... 3వ పేజీ తరువాయి

గ్రావెల్, లేఅవుట్‌లోని మట్టిని దర్జాగా తరలించుకుపోతున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే లేఅవుట్ అభివృద్ధికి తరలిస్తున్నామని చెబుతున్నారు. రాత్రి వేళల్లో అయితే ఇక అడ్డూ అదుపు లేకుండా తవ్వి తరలించేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు కేసు పెట్టలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాగా గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇస్తే తమపైనే చిందులు తొక్కుతున్నారని గంగవరం గ్రామస్థులు వాపోతున్నారు.

### ప్లాట్ల యజమానుల పాట్లు

గోపాలపట్నం, గాజువాక, విశాఖపట్నం సిటీ, పోతినమల్లయ్యపాలెం తదితర ప్రాంతాలకు చెందిన పేదవారిని గుర్తించి ప్రభుత్వం గంగవరంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే లేఅవుట్ ధ్వంసం చేసి గ్రావెల్, మట్టిని అక్రమార్కులు తరలించుకుపోవడంతో వారి ప్లాట్ నంబర్ ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులు పాట్లు పడుతున్నారు. ఎవరికి చెప్పుకోవాలని తెలియక ఆందోళన చెందుతున్నారు.

### తహసీల్దార్ ఫిర్యాదు చేసినా...

గంగవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు తెలుసుకుని గత ఏడాది ఆగస్టులో తహసీల్దార్ బి.సత్యనారాయణ విచారణ జరిపారు. వలంటీర్‌తో పాటు మరో ఎనిమిది మంది వైసీపీ నాయకులు ఈ తవ్వకాల వెనుక ఉన్నట్టు గుర్తించి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే వారిలో ఒక్కరిపై కూడా పోలీసులు కేసు పెట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలను ఆపాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని గంగవరం గ్రామస్థులు కోరతున్నారు.


బొంతువీధి ప్రవేశంలోని రహదారిపై పేరుకుపోయిన చెత్తకుప్ప


వెంకునాయుడుపేట వీధిలో...


బొంతువీధిలో...

# ఎన్నాళ్లు..ఇలా..?

- నర్సీపట్నంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు
- దుర్వాసన, దోమల బెడదతో పట్టణవాసులు అవస్థలు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు

**నర్సీపట్నం, జనవరి 17 :** పట్టణ వాసులను చెత్త సమస్య వీడడం లేదు. పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించినా వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు కదలడం లేదు. ఫలితంగా ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపాలిటీలోని వంద మంది పారిశుధ్య కార్మికులు గత నెల 26వ తేదీ నుంచి 16 రోజుల పాటు సమ్మె చేసిన విషయం తెలిసిందే. దీంతో వార్డులు, ఇందిరా మార్కెట్ తదితర ప్రాంతాలలో చెత్తాచెదారం పేరుకుపోయింది. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు తిష్ట వేసింది. ఓ వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో ఆయా ప్రాంతాల వారు అవస్థలకు గురయ్యారు. అనంతరం జరిగిన చర్చలు సఫలం కావడంతో సదరు కార్మికులు ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మెను విరమించారు. అయినప్పటికీ చెత్త సమస్య పరిష్కారం కాలేదు. డంపర్ బిన్‌లలో చెత్త నిండిపోయి కంపుకొడుతోంది.

ప్రజారోగ్య విభాగం అధికారుల లెక్కల ప్రకారం రోజుకి 30 టన్నులు చొప్పున సమ్మె 16 రోజులకు 480 టన్నుల చెత్త పట్టణంలో పేరుకు పోయింది. రోజువారీ చెత్తే ఎత్తడానికి పారిశుధ్య కార్మికులు సరిపోవడం లేదని మునిసిపాలిటీ ప్రజారోగ్య విభాగం అధికారులు గగ్గోలు పెట్టేవారు. ఇటువంటి తరుణంలో కార్మికుల సమ్మె కాలంలో పేరుకు పోయిన టన్నుల కొద్దీ చెత్తను శుభ్రం చేయడానికి ఇంకెన్ని రోజులు పడుతుందోనని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెత్తను తొలగించడంతో పాటు కాలువల్లో పూడిక తీయించే ఏర్పాట్లు చేయాలని అంతా కోరుతున్నారు.


పోలీస్ స్టేషన్ పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పల వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళ


ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద...

# వేతనాలు పెంచితేనే విధుల్లో చేరుతాం

- తేల్చి చెప్పిన అంగన్‌వాడీలు
- షోకాజ్ నోటీసులకు లిఖిపూర్వక సమాధానాలు
- సమ్మె అణచివేత ధోరణి సరైన పద్ధతి కాదని ఆవేదన

**నర్సీపట్నం, జనవరి 17 :** న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించుండా ఎస్మా ప్రయోగించి, సమ్మెను అణచి వేయాలని ప్రభుత్వం చూసిందని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ప్రాజెక్టు నాయకురాళ్లు మహాలక్ష్మి, సామ్రాజ్యం ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు బుధవారం సీడీపీవో మేరీ సువార్తకు లిఖిత పూర్వంగా సమాధానం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో 37 రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**గొలుగొండ :** న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు విధుల్లో చేరేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులపై సంఘం నాయకురాళ్లు మంగతాయారు, ఆర్.వెంకటలక్ష్మి ఇక్కడి దీక్షా శిబిరంలో మాట్లాడుతూ పనికి తగిన వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పాల్గొన్నారు.

**రావికమతం :** వేతనాలు పెంచడంతో పాటు న్యాయమైన డిమాండ్లన్నీ పరిష్కరిస్తేనే విధుల్లో చేరుతామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని రావికమతం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ఇక్కడి ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. వీటిపై బుధవారం వారంతా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో తామంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ పరిస్థితుల్లో వేతనాలు పెంచితేనే తాము విధుల్లో చేరుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ సత్యవేణి, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.


షోకాజ్‌కు లిఖిత పూర్వకంగా సీడీపీవోకు సమాధానమిస్తున్న అంగన్‌వాడీలు



గొలుగొండలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు


రావికమతంలో ఐసీడీఎస్ ఉద్యోగికి సంజాయిషీ పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

## చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజలకు మంచి

'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టీడీపీ నాయకుడు విజయ్

**మాకవరపాలెం, జనవరి 17 :** వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటలో పయనించాలంటే సమర్థుడైన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండలఅగ్రహారంలో బుధవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారెంటీలతో కూడిన పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేదలకు దగాచేశారని ఆరోపించారు. యువత భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ కోనేరు స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేశారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సదరు స్థలం యథావిధిగా ఉండేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కోనేరు స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించి అక్కడ గౌరీపరమేశ్వరుల గుడిని నిర్మిస్తామన్నారు. జగన్ పాలనలో గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలంతా గుర్తించి రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు, శేషుకుమార్, సుర్ల శంకరరావు, కొండలరావు, బుచ్చి రాంప్రసాద్, నాయుడు, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కొండలఅగ్రహారంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట : డిప్యూటీ సీఎం బూడి


సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ముత్యాలనాయుడు

**చీడికాడ, జనవరి 17 :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని బైలపూడిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివా లయ భవనాన్ని, రైతుభరోసా కేంద్ర భవ నాన్ని, హెల్త్‌క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదావరలక్ష్మి, సర్పంచ్ జాజిమొగ్గల గంగతల్లి, ఎంపీటీసీ గాడి నాగరత్నం, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజుబాబు, గొల్లవిల్లి స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'సమష్టి కృషితో పంచాయతీల అభివృద్ధి'


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

**రోలుగుంట, జనవరి 17 :** గ్రామాల అభివృద్ధిపై అంతా ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నూకరాజుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే రామానాయుడు

**దేవరాపల్లి, జనవరి 17 :** మండలంలోని ఎస్.గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో పలువురు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రాభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రస్తుత సర్పంచ్ కుమారుడు చిరికి రాజేష్‌తో పాటు బొడ్డు సింహాద్రప్పడు, కుంది దేముడు, గంగనాయుడు, మరో ఐదు కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వీరికి రామానాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు సోమిరెడ్డి గోవింద, పెద్దాడ వెంకటరమణ, పాచిల కృష్ణ, అప్పలనాయుడు, రొంగలి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## షర్మిలకు రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతలపై సంబరాలు


బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

**మాడుగుల, జనవరి 17 :** పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల నియామకంతో పార్టీకి పూర్వ వైభవం రానుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పడాల కొండలరావు పేర్కొన్నారు. షర్మిలకు ఏపీలో పార్టీ పగ్గాలు అప్పజెప్పడంపై బుధవారం మాడుగలలో ఆయన సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ నాయకులు బుదబండ రాజు, ఎం.ఏసురాజు, ఆర్లి ధనుంజయ్, పిల్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రెండు నియోజకవర్గాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ఈపీడీసీ ఎల్ ఎస్ఈ మహేంద్రపాత్రుడు

**చోడవరం, జనవరి 17 :** సబ్బవరం వద్ద నేషనల్ హైవే నిర్మాణ పనుల కారణంగా పెందుర్తి, కళింకోట 132 కేవీ లైన్లలో కొత్తగా మరో మూడు 132 కేవీ లైన్ల టవర్లు ఏర్పాటు పనులు చేపట్టనుండడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.మహేంద్రపాత్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో రోజూ ఉదయం పదకొండు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలోని కె.కోటపాడు, బోయిలకింతాడ, వారాడ, దేవరాపల్లి, చీడికాడ, అప్పలరాజుపురం, మాడుగుల, ఎం.కోడూరు, గాదిరాయి, కేజేపురం సబ్ స్టేషన్లతో పాటు, చోడవరం నియోజకవర్గంలోని చోడవరం, వెంకన్నపాలెం, జన్నవరం, వడ్డాది, పోలేపల్లి, రాజాం, తట్టబంద, రావికమతం సబ్‌స్టేషన్ల పరిధిలో నాలుగు రోజుల పాటు ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

## జనసేన మండల, పట్టణ అధ్యక్షుల నియామకం



మూలినాయుడు, రమేష్

**చోడవరం, జనవరి 17 :** జనసేన చోడవరం మండల, పట్టణ శాఖల అధ్యక్షులుగా గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందాయి. పార్టీలో క్రియాశీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వీరికి బాధ్యతల అప్పగింతపై కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దించి జనసేన, టీడీపీ ప్రభుత్వం స్థాపించడమే తమ లక్ష్యంగా వారు పేర్కొన్నారు.

## సీహెచ్.నాగాపురంలో రాములవారి తీర్థం


రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

**కృష్ణాదేవిపేట, జనవరి 17 :** సీహెచ్.నాగాపురంలోని రామాలయం వద్ద బుధవారం రాములవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోటోరైటప్-1)సీఎం సహాయనిది చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్(17ఎన్ఆర్‌పిఅర్బన్2)

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

**నర్సీపట్నం అర్బన్, జనవరి 17 :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును బుధవారం ఇక్కడ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ అందజేశారు. చెట్టుపల్లికి చెందిన తగరంపూడి సన్యాసిరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని భార్య పద్మకు సీఎం సహాయ నిధునుంచి రెండు లక్షల రూపాయల చెక్కు మంజూరు కావడంతో ఎమ్మెల్యే అందించారు.